అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలి

ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 10 : అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు.

అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

డంపింగ్‌యార్డు పనులు వెంటనే నిలిపివేయాలి

నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న అఖిలపక్షం నాయకులు

నర్సాపూర్, ఫిబ్రవరి10 : ప్యారానగర్ అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న డంపింగ్‌యార్డ్‌ను వెంటనే నిలిపివేయాలని అఖిల పక్షం నాయకులు సోమవారం ఆర్డీవో కార్యాలయంలో డీఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చని అడవి ప్రాంతంలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేయడాన్ని ప్రజలందరూ వ్యతిరేకిస్తున్నారని వెల్లడించారు. ప్రజలకు హాని కలిగించే డంపింగ్ యార్డును వెంటనే ఆపాలని హెచ్చరించారు. డంపింగ్‌యార్డుపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు భిక్షపతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శేఖర్, మాజీ కౌన్సిలర్లు బుచ్చేశ్ యాదవ్, రాజేందర్, ఆంజనేయులు, నాయకులు రమణారావు, అంజిగౌడ్, సూరారం నర్సింహులు, షేక్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే తర్వాతే ఎన్నికలకు వెళ్లాలి

నర్సాపూర్, ఫిబ్రవరి 10 : కులగణన సర్వేను రద్దు చేసి, రీసర్వే నిర్వహించిన తర్వాతనే ఎన్నికలకు వెళ్లాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నర్సాపూర్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ బీసీ నాయకులతో కలిసి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మండలాధ్యక్షుడు చంద్రశేఖర్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వెల్లడించారు. బీసీ గణన సర్వేలో 51 శాతం ఉన్న బీసీలను 46 శాతానికి తగ్గించి చూపించడం జరిగిందని మండిపడ్డారు. పదేండ్ల కింద చేసిన సర్వేలో బీసీలు 51 శాతం ఉండగా ప్రస్తుత సర్వేలో 46 శాతంగా చూపించడం సిగ్గుచేటన్నారు. ఇప్పుడు కేవలం 51 శాతం మాత్రమే కాదని ఇంకా బీసీ జనాభా పెరుగుతదని గుర్తుచేశారు.

నర్సాపూర్‌లో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్ఎస్ బీసీ నాయకులు

కాంగ్రెస్ హయాంలోనే ..

కాంగ్రెస్ సీఎం వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే ప్యారానగర్‌లో డంపింగ్ యార్డు కోసం స్థలం కేటాయించారని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మండలాధ్యక్షుడు చంద్రశేఖర్ గుర్తుచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ అనుమతులు ఇచ్చిందని కాంగ్రెస్ నాయకులు అనడం పూర్తిగా అవాస్తమని వెల్లడించారు. బీఆర్ఎస్ అనుమతులు ఇస్తే ఇప్పటి వరకు డంపింగ్‌యార్డు ఏర్పాటు పూర్తయ్యేది కాదా అని ప్రశ్నించారు. డంపింగ్‌యార్డ్ ఏర్పాటును తక్షణమే రద్దు చేయాలని బీఆర్ఎస్, అఖిలపక్షం తరుపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంచి వాతావరణాన్ని విధ్వంసం చేస్తామంటే దానికి పూర్తిగా బీఆర్ఎస్ వ్యతిరేకమని హెచ్చరించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్‌గౌడ్, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరు వీరేశం, మాజీ ఎంపీపీ హరికృష్ణ, శివంపేట్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, మాజీ సర్పంచ్‌లు సేనాధిపతి, అశోక్, బీఆర్ఎస్ నాయకులు నాగరాజుగౌడ్, మానయ్య పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో మహిపాల్‌రెడ్డి

నర్సాపూర్, ఫిబ్రవరి 10 : నర్సాపూర్ డివిజన్ కేంద్రంలోని కౌడిపల్లి, కొల్చారం మండలాల్లో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో మహిపాల్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు.

టీబీ నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

చేగుంట, ఫిబ్రవరి10 : టీబీ నివారణకు వైద్య సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ పేర్కొన్నారు. చేగుంటలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు సరైన వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ అనిల్‌కుమార్, ప్రోగాం ఆఫీసర్ డాక్టర్ నవీన్ కుమార్, వైద్య సిబ్బంది ఉన్నారు.

మొగిపురుగు బారి నుంచి రక్షించుకోవాలి

రామాయంపేట, ఫిబ్రవరి 10 : రైతులు మొగిపురుగు బారిన పడ్డ పంటలను మందులతో రక్షించుకోవాలని లేకుంటే నీటి తడులను తగ్గిస్తే కూడా నివారణ తగ్గుతుందని రామాయంపేట వ్యవసాయశాఖ డివిజన్ అధికారి రాజ్‌నారాయణ అన్నారు. సోమవారం రామాయంపేట పురపాలిక పరిధిలోని గోల్పర్తి, కోమటిపల్లి, మండలంలోని వివిధ గ్రామాల్లో వరిపంటల వద్దకు వెళ్లి రైతులకు పలు సూచనలు సలహాలిచ్చారు. రైతులు వరి పంటలకు మొగి పురుగు పడితే నీటి తడులను తగ్గించడమే గాకుండా దాని నివారణకు మందులు పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయశాఖ సూచనలు పాటిస్తే రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లదన్నారు. కార్యక్రమంలో ఏఈవో సాయికృష్ణ, ప్రవీణ్ ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.

రైతులకు పంటచేనులో సూచనలిస్తున్న డివిజన్ అధికారి రాజ్‌నారాయణ

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

కర్నాల్‌పల్లిలోని షిర్డీసాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, ఫిబ్రవరి10 : ఆధ్యాత్మిక కేంద్రంగా కర్నాల్‌పల్లి షిర్డీసాయిబాబా ఆలయం విరాజిల్లుతూ సాయిబాబా స్వామి భక్తుల కోరిన కోరికలు తీరుస్తున్నారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. చేగుంట మండల పరిధిలోని కర్నాల్‌పల్లి శ్రీభక్తంజనేయ, శ్రీషిర్డీ సాయిబాబా దేవాలయ చతుర్దశ, నవదశ వార్షికోత్సవ వేడుకలు ఆలయ కమిటీ, వైదిక కార్యక్రమ నిర్వహకులు రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో సోమవారం గణపతి పూజ, స్వస్తి వాచనం,అఖండ దీపారాధన, అగ్నిప్రతిష్ఠ, మహాలింగార్చన మంగళహారతి తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించగా, మొదటి రోజు దుబ్బా క ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కర్నాల్‌పల్లి షిర్డీ సాయిబాబా దేవాలయం ఆధ్యాత్మిక కేంద్రంగా విరిజిల్లు తూ భక్తుల కోరిన కోరికలు తీరుతున్నాయని, ఆలయ అభివృద్ధికి కమిటీ సభ్యులు చేస్తున్న కృషి ఎనలేనిదని, ప్రతి భక్తుడు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆలయ వ్యవస్థాపకులు ఆంజనేయులు, ఆల య కమిటీ చైర్మన్ బచ్చు రమేశ్ గుప్తా, యెర్వబాల్‌రెడ్డి, కాడిగిద్ద యాదరెడ్డి, తుమ్మయాదగిరి, వంటరి రాం రెడ్డి, ఇమ్మడి లక్ష్మణ్, ఇబ్రహీంపూర్ సొసైటీ చైర్మన్ వంటరి కొండల్‌రెడ్డి, అన్నదాన కమిటీ చైర్మన్ కేఆర్ మధుసుదన్ రెడ్డి, కొత్త నాగలింగం, వంటరి శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డి,గోపాల్‌రెడ్డి,బీఆర్ఎస్ జిల్లా నాయకులు రంగయ్యాగారి రాజిరెడ్డి, సుభాష్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, మంచికట్ల శ్రీనివాస్, నాయిని రాజ్‌గోపాల్, వంటరి అశోక్‌రెడ్డి,ఎర్ర యాదగిరి,అలీ, డిష్ రాజు, అన్నం రవి, శ్రీకాంత్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

సహకార సంఘానికి తాళం వేసి నిరసన

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి10 : తమ ప్రమేయం లేకుండా సహకార సంఘం నిర్వాహకులు తమ పేరుపై ఖాతాలను తెరిచి రుణం తీసుకున్నారని చిన్నశంకరంపేట మండలం మడూరు సహకార సంఘం పరిధిలోని రైతులు ఆరోపించారు. ప్రభుత్వం రూ. 2 లక్షల రుణమాఫీ జాబితాలో తమ పేరు లేకపోవడంతో పలుమార్లు సహకార సంఘానికి రాగా తమ పేరుపై రూ. 2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్నది సహకార సంఘం సభ్యులు సూచించారు. తమకు రుణమాఫీ జరగలేదని దానికి కారణం సహకార సంఘం సభ్యుల నిర్వాకమేనని నిరసిస్తూ సోమవారం కార్యాలయానికి తాళం వేసి ఆందోళన చేపట్టారు. ఈ విషయమై సహకార సంఘం చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని సంప్రదించారు. ఆపరేటర్ తప్పిదం వల్లే రైతులకు రుణమాఫీ కాలేదని, రైతు జాబితాను ప్రభుత్వానికి పంపించే సమయంలో ఆపరేటర్ వ్యక్తి గత కారణాల వల్ల కార్యాలయానికి రాలేదని అందువల్లే రుణమాఫీ కాలేదని ఆయన తెలిపారు. 18 మంది రైతులు రూ. 11.60 లక్షల పంట రుణాన్ని తీసుకున్నది వాస్తవమేనని ఎలాంటి ఖాతాలను తెరచి రుణం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. డీఎస్‌వో కరుణాకర్ వద్దకు సహకార సంఘం డైరెక్టర్ వెళుతున్నామని, రైతులు అక్కడికి రావాలని వారికి సూచించినప్పటికీ వారు రాకుండా కార్యాలయం వద్ద ఆందోళన చేసినట్లు ఆయన వివరించారు. కేవలం ఆపరేటర్ తప్పిదం వల్లే పంట రుణాల మాఫీ కాలేదని సహకారం సంఘంలో ఎలాంటి అవినీతి జరగలేదని ఆయన చెప్పారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, ఎలాంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నామని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

సహకార సంఘం కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తున్న సభ్యులు

ఆయిల్ పామ్ సాగు లాభదాయకం

వెల్దుర్తి, ఫిబ్రవరి 10 : ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు ఆర్థిక వృద్ధి సాధించవచ్చని లీవ్ పామ్ రిసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ కృష్ణ అన్నారు. సోమవారం వెల్దుర్తి పంచాయతీ ఎలుకపల్లి గ్రామశివారులో రైతు సత్యనారాయణగౌడ్ సాగు చేస్తున్న ఆయిల్ పామ్ మొక్కలను సిబ్బందితో కలిసి పరిశీలించి మొక్కల పెంపకంపై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ 2023 లో మెదక్ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకోసం ప్రభుత్వంతో పరిశ్రమం ఒప్పందం కుదుర్చుకుందని, ఇప్పటి వరకు జిల్లాలో 900 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని, మరో 2 వేల ఎకరాల్లో సాగుకు రైతులు ముందుకు వచ్చారన్నారు. అంతర పంటల సాగుతో సైతం రైతులు ఆదాయం పొందవచ్చన్నారు.

వెల్దుర్తిలో ఆయిల్ ఫాం మొక్కలను పరిశీలిస్తున్న పరిశ్రమ పీఎం డాక్టర్ కృష్ణ

శివ్వంపేటలో ఫోక్‌సాంగ్ షూటింగ్

శివ్వంపేట, ఫిబ్రవరి 10 : మండల కేంద్రమైన శివ్వంపేటలో ఫోక్‌సాంగ్ చిత్రీకరణ సోమవారం సందడి చేసింది. ఉదయం బగలాముఖి శక్తిపీఠంలో రచయిత, ప్రొడ్యూసర్ శ్రీశైలం అమ్మవారికి పూజలు చేసి చిత్రీకరణ ప్రారంభించారు. బీఆర్ఎస్ గ్రామకమిటీ అధ్యక్షుడు లక్ష్మీనర్సయ్య, మాజీ ఉపసర్పంచ్ పద్మావెంకటేశ్, నాయకులు పోచాగౌడ్, రామాగౌడ్, నటీనటులు ఉన్నారు.

శక్తిపీఠంలో చిత్రీకరణ ప్రారంభిస్తున్న యూనిట్ సభ్యులు

అప్పుల బాధతో రైతు మృతి

కౌడిపల్లి, ఫిబ్రవరి 10 : అప్పుల బాధతో చెరువులో దూకి రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని రాజిపేటలో సోమవారం చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాజం నర్సింహులు (38) తనకున్న కొద్ది పాటి పొలంలో వ్యవసాయం, బోరు కోసం చేసిన అప్పులను ఎలా తీర్చాలో తెలియక చివరకు చెరువులో దూకి తనువు చాలించాడు. 9న భార్యకు మళ్లీ వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి ఎంతకు తిరిగి రాలేదు. సోమవారం వెతుకు తున్న క్రమంలోతెలిసిన వారు పెద్ద చెరువు పరిసర ప్రాంతంలో కనిపించాడన్న సమాచారంతో గ్రామస్తులు, కుటుంబీకులు చెరువు వద్దకు వెళ్లి చూడగా అక్కడ ఆనవాళ్లు కనిపించాయి. గ్రామస్తుల సహకారంతో చెరువులో వెతకగా, మృతదేహం లభ్యమైంది. మృతిడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యవసాయ కూలీ మృతి

రామాయంపేట, ఫిబ్రవరి 10 : చికిత్స పొందుతూ ఓ వ్యవసాయ కూలీ మృతి చెందిన సంఘటన సిద్దిపేట ప్రభుత్వ దవాఖానలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రామాయంపేట మండలం తొనిగండ్ల గ్రామానికి చెందిన గౌండ్ల సిద్దార్థగౌడ్ (36) గ్రామంలోని కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తాడు. కొన్ని రోజులుగా తీవ్ర మనస్తాపానికి గురై శనివారం విషం గుళికలను మింగాడు. దీంతో తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబీకులు దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి విషమించి మృతి చెందాడు. పంచనామా నిర్వహించిన పోలీసులు, కుటుంబీకుల ఫిర్యా దు మేరకు సోమవారం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో బాలుడు మృతి

పాపన్నపేట, ఫిబ్రవరి 10 : విద్యుత్‌షాక్‌తో బాలుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని దనూజ తండాలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నర్సింగరావు పల్లి తండాకు చెందిన కేతావత్ లక్ష్మణ్, కుమారుడు అనిరుధ్ (5) కలిసి ఓ శుభకార్యానికి ధనుజాతండాకు వెళ్లారు. అక్కడ అనిరుధ్ స్పీకర్ బాక్సుల వద్ద ఉన్న వైరును చూడకుండా కాలు పెట్టడంతో విద్యుత్ షాక్‌తో కింద పడ్డాడు. వెంటనే మెదక్‌లోని దవాఖానకు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు చెప్పారు. బాలుడు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

విద్యార్థుల ప్రతిభను వెలికి తీయాలి

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 10 : విద్యార్థులు తమలోని ప్రతిభను వెలికి తీసి బావి భారత సైంటిస్టులుగా ఎదగాలని జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఫిజికల్ సైన్స్ టీచర్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాధాకిషన్ టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. జిల్లా అకడమిక్ అధికారి సుదర్శనమూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఉపాధ్యాయులు మల్లారెడ్డి, నాగేంద్రబాబు, నర్సింహులు, కృష్ణ, దశరథం, మమత, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న విద్యాశాఖాధికారి

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి10 : బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పరామర్శించారు. సోమవారం మండల పరిధిలోని గజగట్లపల్లి గ్రామానికి చెందిన లింగయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. గ్రామానికి వెళ్లి బా ధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజు, రవీందర్ ఉన్నారు.

పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నారికి ఆశీర్వాదం

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి10 : జన్మదిన వేడుకలను మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. సోమవారం మండల పరిధిలోని జంగరాయి మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డి మనుమడి మొదటి జన్మదిన వేడుకలను చిన్నశంకరంపేటలో నిర్వహించగా, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. మాజీ జడ్పీటీసీ మాధవి, బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు రాజు, మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై సమీక్ష

అదనపు కలెక్టర్ నగేశ్

పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు పై సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్ రూరల్, ఫిబ్రవరి10 : మెదక్ మండలంలోని రాజ్‌పల్లి, హవేళీఘన్‌పూర్ మండలంలోని మద్దులవాయి గ్రామాల పోలింగ్‌స్టేషన్ల ఏర్పాటుపై అభ్యంతరాలు తెలిపాలని వివిధ రాజకీయ ప్రతినిధులతో అదనపు కలెక్టర్ నగేశ్ సూచించారు. సోమవారం మెదక్ మండలంలోని రాజ్‌పల్లి, హవేళీఘన్‌పూర్ మండంలోని మద్దులవాయి గ్రామా ల పోలింగ్ స్టేషన్ల ఏర్పాటులో వివిధ పార్టీ ప్రతినిధుల అభ్యంతరాలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్దు ల వాయి,రాజ్‌పల్లి పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. మద్దుల వాయి గ్రామంలో, 8 వార్డులు ఉన్నాయని 189 పురుష ఓటర్లు ఉండాగా, 231 మహిళా ఓటర్లు ఉన్నారని వివరించారు. రాజ్‌పల్లిలో10వార్డులకు 10 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. 959 పురుష ఓటర్లు ఉండగా, 1097 మహి ళా ఓటర్లు ఉన్నారని వివరించారు. పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని సమావేశంలో తెలియజేశారు. డీపీవో యాదయ్య, జడ్పీ సీఈవో ఎల్లయ్య, ఆర్డీవోలు, రాజకీయ పార్టీ ప్రతినిధులు ఉన్నారు.

ఆర్థిక సాయం

రామాయంపేట, ఫిబ్రవరి 10 : అనారోగ్యంతో మృత్యువాత పడిన బాధిత కుటుంబానికి సంఘసేవకుడు, యువత నాయకుడు గట్టు ప్రశాంత్ సోమవారం రూ. 4 వేలు ఆర్థిక సాయం అందజేశారు. రామాయంపేట మండలం రాయిలాపూర్ గ్రామానికి చెందిన మ్యాదరి లక్ష్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆయన వెంట కొమిరె లాజర్, గట్టు రాజు, రమేశ్, మహేందర్ తదితరులు ఉన్నారు.

జిల్లా స్థాయి టాలెంట్ టెస్టులో విద్యార్థి ప్రతిభ..

వెల్దుర్తి, ఫిబ్రవరి 10 : జిల్లా స్థాయిలో నిర్వహించిన భౌతిక–రసాయన శాస్త్ర టాలెంట్ టెస్టులో వెల్దుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి శ్రీచరణ్‌గౌడ్ తృతీయ స్థానంలో నిలిచాడు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా విద్యాధికారి రాధాకిషన్ చేతుల మీదుగా శ్రీచరణ్ బహుమతిని అందుకున్నట్లు పాఠశాల హెచ్ఎం సాంబయ్య తెలిపారు. జిల్లా స్థాయిలో మూడో స్థానంలో నిలిచి బహుమతి సాధించిన శ్రీచరణ్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

ఎంపీటీసీ వారిగా ఓటరు లిస్టు విడుదల

శివ్వంపేట, ఫిబ్రవరి 10 : మండలంలోని ఎంపీటీసీల వారీగా ఓటరు లిస్టు జాబితాను సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నాగేశ్వర్‌గుప్తా నోటీసుబోర్డు వద్ద పబ్లికేషన్ చేశారు. ఎంపీటీసీల వారీగా మహిళలు, పురుషుల ఓట్లు మొత్తం ఓటరులిస్టు విడుదల చేశారు. మొత్తం 12 ఎంపీటీసీ స్థానాలకు పురుషులు 16,647, స్త్రీలు 17688, ఇతరులు ఒకరుగా ఉన్నారు. మొత్తం 34,336 మంది ఓటర్లు ఉన్నట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో తిరుపతి రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ నగేశ్, కార్యదర్శి రాజు తదితరులు ఉన్నారు.

ఓటరు లిస్టు పబ్లికేషన్ చేస్తున్న అధికారులు

వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

మిరుదొడ్డి (అక్బర్‌పేట–భూంపల్లి) ఫిబ్రవరి 10 : అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని ఎస్‌బీఆర్ కల్యాణ మండపంలో సోమవారం తెల్లాకుల సర్పవ్వ–సత్తయ్య దంపతుల పుత్రిక సుజాత (సునీత)–శశిధర్ వివాహం జరిగింది. వివాహ వేడుకల్లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై కళా ప్రదర్శన

చిన్నశంకరంపేట,ఫిబ్రవరి 10 : మండల పరిధిలోని కొర్విపల్లిలో సోమవారం ఓటుహక్కుపై కళాకారులు కళా ప్రదర్శన నిర్వహించారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటుహక్కు తమ ఓటును డబ్బులకు మద్యానికి కుల మతాలకు అమ్ముకోకూడదని పాటల ద్వారా ప్రజలకు కండ్లకు కట్టినట్టుగా కళాకారులు ప్రజలకు వివరించారు.

వ్యక్తి అదృశ్యం

సత్యనారాయణ (ఫైల్)

చిన్నశంకరంపేట,ఫిబ్రవరి 10 : వారం రోజుల కింద పెండ్లికి వెళ్లి ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. చిన్నశంకరంపేట మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన అర్కెల సత్యనారాయణ (42) హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో బంధువుల పెండ్లి ఉందని ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లాడు. పెండ్లికి వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో అతడికి ఫోన్ చేస్తే అతడి ఫోన్‌స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువుల వద్ద స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య బుచ్చమ్మ సోమవారం చిన్నశంకరంపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై నారాయణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సైబర్ మోసాలకు గురికావద్దు

రామాయంపేట, ఫిబ్రవరి 10 : విద్యార్థులు సైబర్ నేరాలకు గురికావద్దని మూఢ నమ్మకాలను అసలే నమ్మొద్దని రామాయంపేట ఏఎస్సై రవీందర్, కానిస్టేబుల్ భూపాల్ అన్నారు. సోమవారం రామాయంపేట మండలం రాయిలాపూర్ ప్రభు త్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. . సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ పెరిగి పోతున్నారని వారి పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నర్సాపూర్, ఫిబ్రవరి10 : నర్సాపూర్ పట్టణంలోని జడ్పీహెచ్ఎస్‌లో సోమవారం జంతు హింస నివారణ సంఘం, పశుసంవర్ధక శాఖ మెదక్ ఆధ్వర్యంలో ఆధునిక యుగంలో పశుపోషణ ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను పశుసంవర్ధక శాఖ తరుపున నర్సాపూర్ వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డా.బి. జనార్దన్‌రావు మండల వైద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఏడీ జనార్దన్‌రావు మాట్లాడుతూ జంతుసంక్షేమంలో విద్యార్థుల పాత్ర కీలకమైనదని వెల్లడించారు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను వివరించి వాటి నివారణ చర్యల గురించి తెలియజేశారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది రామకృష్ణ, గోవర్ధన్ హాజరయ్యారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

అల్లాదుర్గం, ఫిబ్రవరి 10 : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాంపూర్‌లో చోటు చేసుకుంది. కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్ గ్రామానికి చెందిన గొండ కృష్ణ (28) స్థానికంగా ఉన్న రైస్‌మిల్లులో కూలీ పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆదివారం నైట్ డ్యూటీ చేసుకొని ఇంటికి వెళ్లాడు. మిల్లులో పని ఉందని సోమవారం మధ్యాహ్నం వెళ్లినట్లు వారు తెలిపారు. రైస్‌మిల్లులో ఉన్న సంపులో పడి మృతి చెందాడు. కృష్ణ మృతిపై పలు అనుమానాలు ఉన్నట్లు కుటుంబీకులు ఆరోపిస్తున్నారు.

వైభవంగా బోనాలు

మెదక్‌రూరల్, ఫిబ్రవరి10 : మండల పరిధిలోని మల్కాపూర శివారులోని మల్లికార్జున స్వామి క్షేత్రంలో భక్తులతో కళకళలాడింది. సోమవారం మల్లన్నస్వామి జాతర రెండో రోజు మక్తాభూపతిపూర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. స్వామికి ఉదయం నుంచే ప్రత్యేక పూజాలు, అగ్నిగుండము, స్వామి వారికి మహిళలు బోనాలులతో ఒగ్గు కళాకారులు, నృత్యాలు చేశారు. కార్యక్రమంలో తిమ్మనగర్, శివ్వాయిపల్లి, మక్తాభూపతిపూర్ పూర్, రాయిన్‌పల్లి గ్రామస్తులు ఉన్నారు.

మల్లికార్జున ఆలయంలో బోనాల సందడి

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

చేగుంట,ఫిబ్రవరి10: తనకు ఉన్న అర్ధ ఎకరం భూమికి నీరు పారడంలేదని మనస్తాపంతో యువకుడు చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేగుంట మం డలం కసాన్‌పల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సున్నం అనురాధ, బాలయ్యలకు ఇద్దరు కుమారులు. రెండో కుమారుడు ప్రశాంత్ (20) తండ్రితో కలిసి వ్యవసాయం చేస్తున్నాడు. పొలం వద్ద ఉన్న బోరు సరిగ్గా నీరు పోయక పోవడంతో మనస్తాపం చెంది, సోమవారం నర్సంపల్లి ఆటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు దౌల్తాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

చెరువులో పడి వృద్ధుడు మృతి

చేగుంట, ఫిబ్రవరి10 :ఊర చెరువులో పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన చేగుంట మండలం కర్నాల్‌పల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. చేగుంట పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొప్పులపల్లి బాలయ్య(79) అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఆదివారం దవాఖానకు వెళ్లి వచ్చిన తర్వాత పొలం వద్దకు వెళ్తానని వెళ్లి తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. సోమవారం ఊర చెరువు గట్టమీద చెప్పులు,సెల్‌ఫోన్ గుర్తించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించినటు చేగుంట ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.